హంద్రీనీవా కాలువపై అసంపూర్తిగా వేదవతి ప్రాజెక్టు స్టేజ్-2 పంప్ హౌస్ పనులు



ఛీ.. చేసిందేమీ లేదు..!

- ఐదేళ్లలో మంత్రి జయరాం చేసిన అభివృద్ధి శూన్యం
- స్వలాభం ఫుల్.. ప్రగతి నిల్..!
- సోదరులు, కుటుంబ సభ్యులే బాగుపడ్డారు
- 'వేదవతి ప్రాజెక్టు' వదిలేసిన అమాత్యుడు
- సొంత నియోజకవర్గంపై మంత్రి మార్క్ ఇదీ...

'మా ఎమ్మెల్యేకు మంత్రి పదవి వచ్చింది. ఇక మా ఊళ్లన్నీ బాగుపడతాయ్. రోడ్లు, స్కూళ్లు, నీరు... అబ్బో ఇలా ఒక్కటేమిటి ఎన్ని కావాలో... ఏమేమీ కావాలో అన్నీ మా మంత్రిగారు చేసేస్తారు...' అని ఐదేళ్ల క్రితం మంత్రి పదవి దక్కించుకున్న గుమ్మనూరు సొంత నియోజకవర్గం ఆలూరు ప్రజల అనుకున్నారు. కానీ నేడు అదే ప్రజల మాట తీరు మారింది. 'ఐదేళ్లు మంత్రి పదవిలో ఉండి ఈయన ఒరగబెట్టింది ఏమీ లేదు..' అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఒకరికో ఇద్దరికో మంత్రి పదవి వరిస్తుంది. అలాంటిది సీఎం జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన మంత్రివర్గ విస్తరణలో రెండు సార్లు గుమ్మనూరు జయరాం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిగా చాన్స్ దక్కించుకున్నారు. మంత్రి పదవి దక్కించుకున్నాక జిల్లా ప్రయోజనాలు దేవుడెరుగు... రెండు సార్లు గెలిపించిన ఆలూరు నియోజకవర్గంలో ఏమాత్రం అభివృద్ధి చేసిన దాఖలాలు లేవు. ఇది చేశా.. అని చెప్పుకోవడానికి మంత్రికి ఒక్క అభివృద్ధి కార్యక్రమం నేటికీ కనపడలేదు. ఈ క్రమంలో ఆయన ముచ్చటగా మూడోసారి ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్లబోతున్నారు. అత్యంత ప్రతికూల పరిస్థితుల్లో ఆయన ఈదఫా ఎన్నికలను ఎదుర్కోనున్నారు. ఈ క్రమంలో ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తుందో.. ఆయన భవితవ్యం ఏమిటన్నది మరికొద్ది రోజుల్లో తేలనుంది.

కర్నూలు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి):

కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం వెనుకబడిన ఆలూరు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కేబినెట్ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రజలు ఇచ్చిన ఈ అవకాశాన్ని ప్రజా సంక్షేమం... ప్రగతి కోసం కొంతైనా కేటాయించి ఉంటే పల్లెసీమలు ఎంతో అభివృద్ధి చెందేవి. ప్రజల ఓట్లేసి గెలిపించి మంత్రి హోదా కట్టి పెడితే స్వలాభానికే పెద్దపీట వేశారని, సోదరులు, కుటుంబ సభ్యులు, సన్నిహితులు కొందరు మినహా ప్రజలు బాగుపడింది లేదని స్థానికులు అంటున్నారు. ముఖ్యంగా ఆలూరు ప్రాంతం శతాబ్దాలుగా ఎదుర్కొంటున్న కరువు.. వలసల నివారణే లక్ష్యంగా గత టీడీపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వేదవతి ఎత్తిపోతల ప్రాజెక్టును అటకెక్కించారనే ఆరోపణలు ఉన్నాయి.

చిప్పగిరి నుంచి ప్రస్థానం..

ఆలూరు నియోజకవర్గం చిప్పగిరి మండలం జడ్పీటీసీగా రాజకీయ అరంగ్రేటం చేసిన మంత్రి గుమ్మగనూరు జయరాం టీడీపీ వీడి ప్రజారాజ్యంలో చేరి.. ఆ తరువాత వైసీపీలో చేరారు. మూడుసార్లు పోటీ చేస్తే.. బీసీలలో బలమైన వాల్మీకి సామాజికవర్గానికి చెందిన వారు.. మాకు న్యాయం చేస్తారని రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిపించారు. వాల్మీకి సామాజికవర్గం కేటగిరిలో వైసీపీ ప్రభుత్వంలో కేబినెట్ హోదా కలిగిన కార్మిక శాఖ మంత్రి పదవి చేపట్టారు గుమ్మనూరు జయరాం. ఈ పదవిలో ఐదేళ్లుగా కొనసాగుతున్నారు. జయరాంకు మంత్రి పదవి రావడంతో ఆలూరు నియోజకవర్గం అభివృద్ధి చెందుతుంది. ముఖ్యంగా ఈ ప్రాంతం చిరకాల స్వప్నమైన జల జీవనాడి 'వేదవతి ప్రాజెక్టు' పూర్తి చేసేందుకు కృషి చేస్తారని ఆశించారు. మంత్రి పదవి చేపట్టిన నాటి నుంచి ఆయన, సోదరులు, కుటుంబ సభ్యులపై ఎన్నో అవినీతి ఆరోపణలు వచ్చాయి. పెద్ద ఎత్తున ఆస్తులు పోగేసుకున్నారే తప్పా అభివృద్ధి కోసం ఏ మాత్రం పాటుపడలేదని స్థానికులు అంటున్నారు. ఏ పల్లెకు వెళ్లినా.. ఎవరిని కదిపినా మంత్రి జయరాం మా ఊరికేమి చేశాడు.. ఆయన, ఆయన కుటుంబ సభ్యులు బాగుపడ్డారే తప్పా కనీసం గ్రామాలకు తాగునీటి పథకాలు కూడా తీసుకురాలేకపోయారని చర్చించుకుంటున్నారు. ఇదీ ఐదేళ్ల మంత్రిగా కొనసాగుతున్న గుమ్మనూరు జయరాం ఆలూరు నియోజకవర్గంలో ప్రగతి ముద్ర అంటున్నారు.

వేదవతిని అటకెక్కించారు..!

వేదవతి కోసం తెచ్చిన పైపులు ఇలా...



తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) సీసీ లైనింగ్ పనులపై చూపిన శ్రద్ధ 'వేదవతి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు' నిర్మాణంపై చూపలేదని ఆయా గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. ఎల్లెల్సీ పనుల్లో నాణ్యతా ఎలా ఉందో అందరికి తెలుసు.. ఆ పనుల్లో పెద్దఎత్తున వాటాలు వస్తున్నాయ్.. వేదవతి ప్రాజెక్టు పనుల్లో రావడం లేదనే ఉద్దేశంతోనే శ్రద్ధ చూపలేని, మంత్రిగా అనుకొని ఉంటే తప్పక సీఎం జగన్‌ను ఒప్పించి నిధులు తెప్పించి ఇప్పటికే పూర్తి చేసి ఉండేవారని స్థానికులు పేర్కొంటున్నారు. ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలు సాగునీరు, 196 గ్రామాలకు తాగునీరు అందించాలనే మహా సంకల్పంతో గత టీడీపీ ప్రభుత్వంలో ఆనాటి సీఎం చంద్రబాబు వేదవతి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. వేదవతి నది నుంచి వృథాగా పోతున్న 8 టీఎంసీల వరద జలాలు ఎత్తిపోసి.. హాలహర్వి, మొలగవల్లి వద్ద నిర్మించే జలాశయాల్లో నిల్వ చేసి పల్లెసీమలను సస్యశామలం చేయాలన్నది ఈ ప్రాజెక్టు లక్ష్యం. 2019 జవనరిలో జీఓ నం.77 జారీ చేసి రూ.1,942.38 కోట్లు నిధులు ఇచ్చారు. టెండర్లు పూర్తి చేసి హైదరాబాద్‌కు చెందిన మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థకు పనులు అప్పగించి నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం రావడం, ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన గుమ్మనూరు జయరాం కార్మిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. వేదవతి ప్రాజెక్టు పూర్తి చేస్తానని పలు సందర్భాల్లో హామీ కూడా ఇచ్చారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్ట్ సంస్థ రెండేళ్ల క్రితమే పనులు ఆపేసింది. మంత్రి గుమ్మనూరు నిధులు తెప్పించి పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహించడం వల్లే పేదల గొంతు తడిపే ఈ ప్రాజెక్టు అటకెక్కిందని సాగునీటి రంగ నిపుణులు, మేధావులు ఆరోపిస్తున్నారు.

వలస బాటలో 'ఆలూరు పల్లెలు'



మంత్రి గుమ్మనూరు జయరాం ప్రాతినిధ్యం వహిస్తున్న ఆలూరు నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లోని ప్రజలు ఇప్పటికే వలసలకు వెళ్లారు. గుంటూరు, విజయవాడ, కర్ణాటక ప్రాంతాలకు వెళ్లి కూలి పనులు చేసుకుంటున్నారు. కనీసం వలసల నివారణలో మంత్రి గుమ్మనూరు ఎలాంటి కృషి చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రైల్వేస్టేషన్ అభివృద్ధికి మోదీ భూమి పూజ

వర్చువల్‌గా మాట్లాడిన పీఎం



జ్యోతి ప్రజ్వలను చేస్తున్న నాయకులు, అధికారులు

ఆదోని టౌన్, ఫిబ్రవరి 26: ఆదోని రైల్వేస్టేషన్‌లో రూ.10.26 కోట్లతో జరిగే పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ సోమవారం వర్చువల్‌గా భూమి పూజ చేశారు. అనంతరం బిగ్ స్ర్కీన్‌పై ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగాన్ని ప్రముఖులు వీక్షించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు విట్టా రమేష్, జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ మాట్లాడారు. మోదీ హయాంలో రైల్వే స్టేషన్లు విమానాశ్రయాలకు దీటుగా అభివృద్ధి చెందడం గర్వకారణం అన్నారు. ఇండియా నుంచి దుబాయ్‌కి సముద్ర గర్భం నుంచి రెండు గంటల్లో చేరుకునేలా సొరంగ మార్గం ద్వారా రైల్వే ట్రాక్ వేయడానికి కృషి జరగడం శుభసూచకంగా భావిస్తున్నామన్నారు. ప్రతిరోజూ 45 నుంచి 50 దాకా రైళ్ల రాకపోకలు ఉన్న ఆదోని రైల్వేస్టేషన్‌లో ఎస్కలేటర్ ఏర్పాటు చేయడం ఎంతో అవసరమని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన విద్యార్థులకు రైల్వేశాఖ బహుమతులను అందజేసింది. కార్యక్రమంలో గుంతకల్లు రైల్వే డివిజినల్ సీనియర్ అధికారి కిష్టప్ప, సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, డీఎస్పీ నారాయణ స్వామి, మాజీ ఎమ్మెల్యే అన్వభాష, కన్వీనర్ ప్రకాష్ జైన్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మలేకర్ శ్రీనివాస్, ఆదోని అసెంబ్లీ కో కన్వీనర్ నాగరాజు గౌడ్, ఆదోని రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ సభ్యుడు ఆదూరి విజయకృష్ణ, ఉపేంద్ర కుమార్, తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొంక భూపాల్ చౌదరి, బుద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

3న పల్స్‌పోలియో



మాట్లాడుతున్న డీఆర్వో మధుసూదన్‌రావు

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 26: మార్చి నెల 3వ తేదీన జరిగే పల్స్‌పోలియో కార్యక్రమం ద్వారా 0-5 సంవత్సరాల చిన్నారులకు టీకాలు వేయించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మధుసూదన్‌రావు అన్నారు. సోమవారం వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పల్స్ పోలియోపై టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ 0-5 సంవత్సరాల వయస్సు ఉన్న చిన్నారులకు తప్పనిసరిగా పల్స్ పోలియో టీకాలు అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం మార్చి 3న ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 వరకు అన్ని పల్స్ పోలియో బూత్‌లలో టీకాలు అందజేయడానికి గానూ విద్యాశాఖ, వైద్య శాఖ సమన్వయం చేసుకుని చిన్నారులకు టీకాలు అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్‌లలో కూడా పల్స్ పోలియో టీకాలు అందజేయాలని సూచించారు. దాదాపు 2011 నుంచి జిల్లాలో పల్స్ పోలియో కేసులు నమోదు కాలేదని, ఇదే స్ఫూర్తితో వైద్యసిబ్బంది ముందుకు సాగాలని అన్నారు. అనివార్య కారణాల వల్ల 3న పల్స్ పోలియో టీకాలు వేసుకుని చిన్నారుల కోసం ఆశా, ఏఎన్ఎంలు మార్చి 4, 5 తేదీల్లో ఇంటింటికి తిరిగి కూడా పోలియో చుక్కలు అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో రామగిడ్డయ్య, డీఐవో ప్రవీణ్ కుమార్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 67 ఫిర్యాదులు

కర్నూలు, ఫిబ్రవరి 26: స్థానిక ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ జి.కృష్ణకాంత్ సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ స్పందనకు బాధితుల నుంచి 67 ఫిర్యాదులు వచ్చాయి.

- ఆన్‌లైన్ ఉద్యోగం ఇప్పిస్తామని, చెన్నై, ముంబైలో ఉద్యోగం ఉంటుందని, రూ.7 లక్షలు వారి ఖాతాకు వేయించుకుని మోసం చేశారని కర్నూలు బి.తాండ్రపాడుకు చెందిన షేక్షావలి ఫిర్యాదు చేశారు.
- కర్నూలు రాధాకృష్ణ నగర్‌కు చెందిన వీరస్వామి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ.8 లక్షలు, 5 తులాల బంగారం తీసుకుని మోసం చేశారని కర్నూలు పట్టణానికి చెందిన వి.గౌరి ఫిర్యాదు చేశారు.
- తుగ్గలి రైల్వే బ్రిడ్జి దగ్గర వర్క్ నిమిత్తం ఎక్స్‌కవేటర్‌ను ఉంచగా.. గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారని తుగ్గలి మండలం రాంపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీకాంత్ రెడ్డి ఫిర్యాదు చేశారు.
- వెలుగోడు మండలంలో అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తామని కర్నూలుకు చెందిన సుభాష్‌బాబు రూ.1.80 లక్షలు తీసుకుని మోసం చేశాడని వెలుగోడు మండలానికి చెందిన ఆనందరావు ఫిర్యాదు చేశారు.
- ఆన్‌లైన్‌లో ఇనాం భూమిని కరెక్షన్ చేస్తామని కర్నూలుకు చెందిన శేషఫణి, కిషోర్, కేశవులు కలిపి రూ.5 లక్షలు తీసుకుని మోసం చేశారని, డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని న్యాయం చేయాలని సల్కాపురం గ్రామానికి చెందిన ప్రసాద్ ఫిర్యాదు చేశారు.
- కోర్టు ఆర్డరు ఉన్నా వ్యవసాయ భూమిని ఆక్రమించిన నాగేశ్వరరావుపై చర్యలు తీసుకోవాలని వెల్దుర్తి మండలం కలుగొట్ల గ్రామానికి చెందిన కాశీం ఫిర్యాదు చేశారు.

స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ అడ్మిన్ నాగరాజు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు సీఐలు ఉన్నారు.




స్పందనలో బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ జి.కృష్ణకాంత్

గందరగోళం

- నేటి నుంచి ఆన్‌లైన్ టెట్ పరీక్ష
- కర్నూలు జిల్లాలో 26,421 దరఖాస్తులు
- మొత్తం 9 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు

కర్నూలు(ఎడ్యుకేషన్),ఫిబ్రవరి 26: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీచర్ ఎలిజిబిలిటీ టెస్టు) గందరగోళం మధ్య మంగళవారం జరగనుంది. ఒకే అభ్యర్థికి ఒకే తేదీన ఒకే సమయంలో టెట్ రెండు పరీక్ష పేపర్లు కేటాయించడంతో ఏ పరీక్షకు హాజరు కావాలో అర్థంగాని పరిస్థితి నెలకొంది. ఒక పేపర్ మిస్ అవుతుందనే బాధతో జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి చేరుకొని పరీక్ష తేదీని మార్చాలని అధికారులను వేడుకుంటున్నారు. మరికొందరికి ఇతర రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడంతో వందల కిలో మీటర్లు ప్రయాణం చేసి పరీక్షలు ఎలా రాయాలని అభ్యర్థులు మదన పడుతున్నారు. కొందరు అభ్యర్థులకు ఒకే రోజు ఒక జిల్లాలో ఉదయం సెషన్‌లో ఒక పేపరు రాయాల్సి ఉండగా.. మధ్యాహ్నం జరిగే పేపర్-2 పరీక్ష మరో జిల్లాలో కేంద్రాన్ని కేటాయించడంతో అంత దూరం వెళ్లి పరీక్ష రాయలేని పరిస్థితి. పరీక్ష కేంద్రాలను సొంత జిల్లాలో ఏర్పాటు చేయడంలో విద్యాశాఖ అధికారులు వైఫల్యం చెందారనే విమర్శలు ఉన్నాయి.



జిల్లాలో మొత్తం 26,421 దరఖాస్తులు

కర్నూలు జిల్లాలో టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్టు (టెట్)కు 26,421 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ టెట్ పరీక్ష ఫిబ్రవరి 27 నుంచి మార్చి 6వ తేదీ వరకు కొనసాగుతాయి. ప్రతి రోజూ ఉదయం 9.30 గంటల నుంచి 12.00 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు రెండు సెషన్స్‌లో నిర్వహిస్తారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 8 గంటలకే చేరుకోవాలి.

జిల్లాలో 7, హైదరాబాదులో 2 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు

కర్నూలు జిల్లా నుంచి టెట్ పరీక్షకు మొత్తం 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో కర్నూలు 5, ఆదోనిలో 1, ఎమ్మిగనూరులో 1, మొత్తం 7 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలాగే హైదరాబాదులో 2 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. కర్నూలులో దూపాడు దగ్గర ఉన్న డా.కేవీ సుబ్బారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అయాన్ డిజిటల్ సెంటర్, నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని సనత్‌నగర్‌లోని అయాన్ డిజిటల్ సెంటర్, జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, వెంకాయపల్లె సమీపంలో ఉన్న జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల, పెద్దటేకూరు వద్ద బృందావన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్. ఆదోనిలో బళ్లారి రోడ్డులో ఉన్న భీమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, ఎమ్మిగనూరు దగ్గర సెయింట్ జోన్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ, పరీక్ష కేంద్రాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాదులో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

- జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ టెట్ పరీక్షను పర్యవేక్షిస్తున్నారు. ప్రతి సెంటరుకు ఒక డిపార్టుమెంటల్ ఆఫీసర్, పరీక్ష కేంద్రాల పర్యవేక్షణకు ఫ్లయింగ్ స్క్వాడ్‌ను నియమించారు. అభ్యర్థుల నుంచి ఏమైనా సమస్యలు ఉన్న యెడల జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో టెట్ సెల్‌ను సంప్రదించాలని డీఈవో శామ్యూల్ సూచించారు. వసంతనగర్ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం.సంపత్ కుమార్ 7396353402, డీఈవో కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ డి.బాబాఫక్రుద్దీన్ 6300046199, జూనియర్ అసిస్టెంట్ ఎస్.మహేష్ 9032397231 నెంబర్లను సంప్రదించాలని డీఈవో తెలిపారు.

మిరప రైతులను కబళించిన మృత్యువు

- కర్ణాటకలో రోడ్డు ప్రమాదం
- పెద్దకడుబూరు మండలానికి చెందిన ముగ్గురి దుర్మరణం
- నాగలాపురం, సింగరాజనహళ్లి గ్రామాల్లో అలుముకున్న విషాదం



యంకన్న (ఫైల్) పి. మస్తాన్(ఫైల్) ఈరన్న (ఫైల్)

పెద్దకడుబూరు, ఫిబ్రవరి 26: మిరప రైతులను మృత్యువు కబళించింది. కర్ణాటకు వెళ్తున్న మిరప రైతులను రోడ్డు ప్రమాద రూపంలో పొట్టనబెట్టుకుంది. ఈ సంఘటన కర్ణాటకలోని దావణగేరి వద్ద ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామస్థుల వివరాల మేరకు.. పెద్దకడుబూరు మండలంలోని నాగలాపురం, సింగరాజనహళ్లి గ్రామాలకు చెందిన డ్రైవర్‌తో సహా పది మంది రైతులు నాలుగు టన్నుల బ్యాడిగి రకం మిరప కాయలను అమ్ముకునేందుకు ఒక మినీ వాహనంలో కర్ణాటకలోని దావణగేరి సమీపంలో ఉన్న బ్యాడిగి పట్టణానికి బయల్దేరారు. ఆదివారం అర్ధరాత్రి వాహనం దావణగేరి సమీపంలోకి చేరుకోగానే టైరు పంక్చర్ కావడంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో వాహనంలో ఉన్న బోయ యంకన్న(48), మస్తాన్(48), ఆటో ఈరన్న (35)కు ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. వీరితోపాటు మరో నలుగురికి గాయాలయ్యాయి. వీరిని సమీపంలోని దావణగేరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదం సమాచారం అందుకున్న రైతుల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హుటాహుటిన సంఘటనా స్థలానికి బయల్దేరారు. బోయ యంకన్నకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మస్తాన్‌కు భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు, ఆటో ఈరన్నకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ముగ్గురు రైతులు మృతి చెందడంతో నాగలాపురం, సింగరాజనహళ్లి లో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని తోటి రైతులు, గ్రామస్థులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.



వేదికపై సంఘీభావం తెలుపుతున్న నాయకులు



సభకు హాజరైన తెలుగు తమ్ముళ్లు

టీడీపీతోనే బీసీలకు రాజ్యాధికారం

- అధికారంలోకి రాగానే బీసీలకు రక్షణ చట్టం
- నంద్యాలలో 'జయహో బీసీ' సభ
- తరలి వచ్చిన టీడీపీ శ్రేణులు

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 26: తెలుగుదేశంతోనే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమవుతుందని నంద్యాల జిల్లా టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా టీడీపీ కార్యాలయం వద్ద సోమవారం 'జయహో బీసీ' బహిరంగ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు ఎన్ఎండీ ఫరూక్, మాజీ ఎమ్మెల్యేలు బీసీ జనార్దన్‌రెడ్డి, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, గౌరు చరిత, నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వెదుర్ల రామచంద్రారావు, ఏవీఆర్ ప్రసాద్, తాతిరెడ్డి తులసీరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అబ్దుల్ వహీద్, నంద్యాల జిల్లా యువ విభాగం అధ్యక్షుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గోవిందనాయుడు, జనసేన జిల్లా అధ్యక్షుడు చింతా సురేష్ తదితరులు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి టీడీపీ, జనసేన నాయకులు, బీసీ సాధికారత రాష్ట్ర, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు. ముందుగా నాయకులు ఎన్టీఆర్, పూలే కాంస్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసీపీ పాలనలో బీసీలను అణగదొక్కారని, బీసీల ద్రోహి జగన్‌మోహన్‌రెడ్డి అంటూ నాయకులు ధ్వజమెత్తారు.

జగన్ పాలనలో దాడులు, హత్యలు, కేసులు



వైసీపీ పాలనలో బీసీలపై దాడులు, హత్యలు, అక్రమ కేసులు నిత్యకృత్యంగా మారాయి. వైసీపీ కులాలను విభజించి పాలిస్తోంది. బీసీ కార్పొరేషన్లు అని చెప్పి పదవులు ఇచ్చి కనీసం కూర్చునేందుకు కుర్చీ కూడా లేకుండా చేసింది. బీసీలకు టీడీపీ ప్రభుత్వం ఎంతగానో గుర్తింపునిచ్చి రాజకీయ రిజర్వేషన్లు కల్పించి స్పీకర్లు, మంత్రులు, ఉప ముఖ్యమంత్రులుగా చేసింది. కార్పొరేషన్ల నుంచి సబ్సిడీ రుణాలు మంజూరు చేసి బీసీ కులాలను, కులవృత్తులకు ప్రోత్సాహకాలను అందించింది. కొలిమిగుండ్లలో బీసీ సోదరుడు వడ్డె సుబ్బారావు రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక వైసీపీ నాయకులు హత్య చేశారు. సుబ్బారావు హంతకులను ఏ ఒక్కరినీ వదిలే ప్రసక్తే లేదు. నా నియోజకవర్గంలో 15 మంది బీసీ సోదరులపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. కష్టపడి పని చేస్తేనే పదవులు వస్తాయి.. పదవులు వచ్చాక ఆ సామాజిక వర్గానికి న్యాయం జరగాలి. అది టీడీపీతోనే సాధ్యం. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఏర్పాటు తథ్యం.

– బీసీ జనార్దన్‌రెడ్డి, బనగానపల్లె టీడీపీ అభ్యర్థి

వైసీపీని అంతం చేద్దాం



– బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, శ్రీశైలం అభ్యర్థి

బీసీలు టీడీపీకి వెన్నెముక లాంటి వారు. అట్టడుగున ఉన్న బీసీ వర్గాలను టీడీపీపైకి తీసుకురావడం జరిగింది. ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు పాలనలో బీసీలకు పెద్దపీట వేసి వారి అభ్యున్నతికి కృషి చేసింది. జగన్‌మోహన్‌రెడ్డి బీసీ వర్గాలను అణగదొక్కాడు. క్షేత్రస్థాయిలో అందరం కలిసికట్టుగా పని చేసి రాక్షస పాలనను అంతం చేద్దాం. ప్రస్తుతం వైసీపీ జెండాలు మోస్తున్న కార్యకర్తలు కూడా అసంతృప్తిగానే ఉన్నారు. వారిని కూడా కలుపుకొని టీడీపీ విజయానికి కృషి చేయాలి. కష్టపడి టీడీపీ, జనసేన కూటములు అధికారంలోకి తీసుకొద్దాం.

బీసీలను నిలువునా ముంచారు



బీసీలను వైసీపీ నాయకులు నిలువునా ముంచారు. ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించారు. బీసీలపై హత్యా రాజకీయాలకు తెరలేపారు. బీసీలకు పెద్దపీట వేసింది తెలుగుదేశం పార్టీ మాత్రమే. బీసీలు టీడీపీకి వెన్నెముకలాంటి వారు. బీసీల అభ్యున్నతి కోసం టీడీపీ ప్రభుత్వంలో సబ్సిడీ రుణాల ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపాం. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం వాటన్నింటినీ రద్దు చేసింది. బీసీల ద్రోహిగా జగన్ చరిత్రలో నిలిచిపోయాడు. రాష్ట్ర భవిష్యత్తు, పిల్లల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని టీడీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. బీసీలపై దాడులను అరికట్టేందుకు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రక్షణ చట్టాన్ని తీసుకొస్తాం.

– గౌరు చరితారెడ్డి, పాణ్యం నియోజకవర్గ అభ్యర్థి

7 నియోజకవర్గాల్లో గెలిచి బాబుకు గిఫ్ట్ ఇస్తాం



బీసీ సోదరులు ఏకతాటిపై నిలబడి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి. జిల్లాలోని మొత్తం ఏడు నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించి చంద్రబాబు నాయుడుకు గిఫ్ట్‌గా ఇస్తాం. నంద్యాలలో జరిగిన అభివృద్ధి అంతా చంద్రబాబు నాయుడు హయంలోనే జరిగింది. టీడీపీ అధికారంలోకి రాగానే బీసీలపై జరిగిన దాడులను అరికట్టేందుకు ప్రత్యేకంగా రక్షణ చట్టాన్ని అమలు చేస్తాం.

– మల్లెల రాజశేఖర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

పనికి మాలిన పాలన



రాష్ట్రంలోని పనికి మాలిన పాలన ఈ దేశంలో ఎక్కడా లేదు. సీఎం జగన్ ఓ అసమర్థుడు. రాష్ట్రానికి కంపెనీలు లేవు.. ఉద్యోగాలు లేవు. అంతర్జాతీయ విమానాశ్రయం తెచ్చిందీ లేదు. సరైన సదుపాయాలు లేక వచ్చిన కంపెనీలు కూడా పక్క రాష్ట్రానికి వెళ్లిపోయాయి. అన్నివర్గాల ప్రజలు విసిగిపోయారు. ముఖ్యంగా బీసీలపై కక్షతో అరాచకాలు సృష్టించి వారి జీవితాలను నాశనం చేశాడు. బీసీలు అంటేనే టీడీపీ.. టీడీపీ అంటేనే బీసీలు. సిద్ధం అంటూ ఓడిపోయేందుకు జగన్‌రెడ్డి సిద్ధంగా ఉన్నాడు. తల్లిని, చెల్లిని వదిలేసిన దుర్మార్గుడు జగన్ రాష్ట్ర ప్రజలకు ఏం చేస్తాడు.

– ఎన్ఎండీ ఫరూక్, నంద్యాల అభ్యర్థి

బీసీలకు న్యాయం జరగలేదు

రాష్ట్రంలో బీసీలకు పదవులు ఇచ్చామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. పదవులు ఇచ్చారుగాని బీసీ వర్గాలకు ఎలాంటి న్యాయం జరగలేదు. రాష్ట్రంలో 70 మంది

టీడీపీతోనే బీసీల్లో ఎదుగుదల



టీడీపీ వచ్చాకే బీసీల్లో ఎదుగుదల వచ్చింది. రాష్ట్రంలో వైసీపీ దుర్మార్గపు విధ్వంస పాలనలో బీసీ సోదరులపై కేసులు పెట్టారు. హత్యా రాజకీయాలను ప్రోత్సహించారు. ఎన్నికలకు ముందు ముద్దులు పెడుతూ వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక జగన్ మోహన్‌రెడ్డి విస్మరించారు. అన్నివర్గాల ప్రజలను మోసం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డికి దోచుకోవడం తప్పా అభివృద్ధి తెలియదు. జిల్లాకు ఎలాంటి పరిశ్రమలు తీసుకురాకుండా యువత జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. జగన్‌ను ప్రజలు తరిమి కొట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.

– మాండ్ర శివానందరెడ్డి



బీసీ సోదరులను కిరాతకంగా చంపారు. బీసీలకు వరంగా ఉన్న బెస్ట్ అవైలబుల్ పాఠశాల స్కీంను ఎత్తి వేశాడు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే బీసీలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందారు. దుర్మార్గపు జగన్ ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

– భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి

మన సంస్కృతి, సాంప్రదాయాలు గొప్పవి

పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



విదేశీయులతో మాట్లాడుతున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం, ఫిబ్రవరి 26: భారతదే సంస్కృతి, సాంప్రదాయాలు ఎంతో గొప్పవని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. సోమవారం అమెరికా, కార్లిఫోర్నియా దేశాలకు చెందిన దాదాపు 24 మంది మహిళా భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించి రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా విదేశీ భక్తులతో పీఠాధిపతి రాఘవేంద్ర స్వామి మహిమలు, అద్భుతాలు, ఆయన జీవిత చరిత్రను వివరించారు. భారతదేశంలో సంస్కృతి, సాంప్రదాయాలు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. దేశ చరిత్రను తెలుసుకునే విధంగా రాఘవేంద్ర స్వామి రచించిన గ్రంథాలు, రాఘవేంద్ర స్వామి చరిత్ర తెలియజేసే పుస్తకాలను ఉచితంగా అందజేశారు. అనంతరం ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, ద్వారపాలక అనంతస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూ పీఆర్వోగా రవి శంకర్



నియాక పత్రాన్ని అందిస్తున్న ఆర్‌యూ ఉపకులపతి

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 26: రాయలసీమ యూనివర్సిటీ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్‌గా తెలుగుశాఖ ప్రొఫెసర్ డాక్టర్ వి.రవిశంకర్‌ను నియమించినట్లు రిజిస్ట్రార్ డాక్టర్ నాగులు అంకన్న తెలిపారు. సోమవారం ఉపకులపతి ఛాంబర్లో వైస్ చాన్సలర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు.

బర్డ్‌ఫ్లూపై అప్రమత్తం

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 26: నెల్లూరు జిల్లాలో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకడంతో జిల్లా అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో కోళ్ల ఫారాల్లోని కోళ్ల నుంచి రక్త నమూనాల సేకరణ ప్రారంభించినట్లు పశుసంవర్ధక శాఖ జేడీ రామచంద్రయ్య సోమవారం తెలిపారు. బర్డ్‌ఫ్లూ వైరస్ ప్రమాదకరమైనదని, కోళ్లు, బాతులు, ఇతర పక్షుల రక్త నమూనాలను సేకరించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటిదాకా 40 రక్త నమూనాలు సేకరించాలని లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 30 శాంపుల్స్ సేకరించామని చెప్పారు. మిడ్తూరు మండలంలోని రోళ్లపాడు బట్టమేక పక్షి కేంద్రంలో వాటి నుంచి 24 శాంపుల్స్ తీశారు. నంద్యాలలో బాతుల నుంచి, ఆలూరు, కర్నూలు రూరల్ మండలాల్లో ఏర్పాటు చేసిన కోళ్ల ఫారాల్లో కోళ్ల నుంచి రక్తనమూనాలు సేకరించినట్లు తెలిపారు. ప్రస్తుతం నీటి నిల్వలు తక్కువగా ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి ఉమ్మడి జిల్లాలోని రిజర్వాయర్ల వద్దకు వలసపక్షులు వచ్చేందుకు అవకాశం ఉందని, వెలుగోడు, సుంకేసుల, గార్గేయపురం తదితర రిజర్వాయర్ల సమీపాల్లోని కోళ్ల ఫారాల్లోని కోళ్ల నుంచి రక్తనమూనాలను సేకరించామని వెల్లడించారు. ప్రస్తుతం ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, బర్డ్‌ఫ్లూ వైరస్ ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎక్కడా సోకినట్లు తమ దృష్టికి రాలేదని జేడీ రామచంద్రయ్య తెలిపారు.

శ్రీశైలంలో ఏసీబీ తనిఖీలు

శ్రీశైలం, ఫిబ్రవరి 26: శ్రీశైలం దేవస్థానంలో గతంలో జరిగిన అభివృద్ధి పనులలో అవకతవకలు జరిగినట్లుగా ఫిర్యాదులు రావడంతో సోమవారం ఏసీబీ సీఐ విశ్వనాథ్ ముగ్గురు బృందంతో కలిసి తనిఖీలు చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు ప్రహరీని ఏసీబీ అధికారులు పరిశీలించారు. ప్రహరీ కొలతలను నమోదు చేసుకున్నారు. శ్రీశైల దేవస్థానం ఇంజనీరింగ్ అధికారుల వద్ద నుంచి గతంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి బ్లూ ప్రింట్ సేకరించారు. ఇప్పటికే పలు దఫాలలో పరిశీలన చేసిన ఏసీబీ అధికారులు సోమవారం మళ్లీ పరిశీలించారు.

యువకుడి దారుణ హత్య

- హారన్ మోగించాడని గొడవ
- ఆటోలో ఉన్న కత్తులతో దాడి

కర్నూలు, ఫిబ్రవరి 26: కర్నూలు నగరంలో ఆదివారం అర్ధరాత్రి సాయికుమార్ (20) దారుణహత్యకు గురయ్యాడు. ఇతనితోపాటు ఇతని బావమరిది కురుమూర్తి తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన నగరంలో కలకలం రేపింది. పోలీసుల వివరాల మేరకు.. స్థానిక రోజా వీధికి చెందిన సాయికుమార్ తల్లిదండ్రులు కొన్నేళ్ల కిందటే చనిపోయారు. అవ్వ దగ్గరే ఉంటున్నాడు. అవ్వ కూడా వారం రోజుల కిందటే చనిపోయింది. ఇసుక లోడింగ్ పనికి వెళ్తుంటాడు. ఇతని బావమరిది కురుమూర్తిది కూడా రోజా వీధే. సొంతంగా ఆటో నడుపుకుంటూ జీవిస్తుంటాడు. వీరిద్దరూ ఆదివారం రాత్రి రోజా వీధి నుంచి పాత కంట్రోల్ సమీపంలో ఉన్న హోటల్‌కు పరోటా తినేందుకు బయలుదేరారు. రోజా వీధి దాటిన తర్వాత కొద్ది దూరం వచ్చేటప్పటికీ వీరి వెనుకాల ఓ ఆటో వచ్చి అదే పనిగా హారన్ మోగించింది. దీంతో కురుమూర్తి వీరి ఆటో ఆపి వెనుక ఆటోలో ఉన్న ముగ్గురితో గొడవపడ్డాడు. గొడవ సర్దుమనిగిన తర్వాత బయలుదేరారు. మరోసారి కూడా ఆటో హారన్ మోగించడంతోపాటు ఆటోను ఓవర్‌టెక్ చేశారు. దీంతో సాయి కుమార్, కురుమూర్తిలు కూడా ముందుకు వెళ్తున్న ఆటోను ఓవర్‌టెక్ చేసి ముందుకు వెళ్లారు. ఇలా ఒకరినొకరు ఆటోను ఓవర్‌టెక్ చేసుకుంటూ కోర్టు సమీపంలో ఉన్న చాంబర్‌ఆఫ్ కామర్స్ కార్యాలయం దగ్గరకు వచ్చారు. సాయికుమార్, కురుమూర్తిలు వీరి ఆటోకు అడ్డంగా వెళ్లి ఆటోను నిలిపారు. అక్కడ వీరందరికి గొడవ జరిగింది. అయితే.. అప్పటికే ఆటోలో కత్తులు ఉండటంతో సాయికుమార్, కురుమూర్తిలపై నిందితులు దాడులు చేశారు. సాయికుమార్ కడుపులో కత్తి దిగి అక్కడికక్కడే మృతి చెందాడు. కురుమూర్తి కడుపులో, వీపుపైన కత్తితో దాడి చేసి వెంటనే అక్కడి నుంచి పరారయ్యారు. స్థానికులు అప్రమత్తమై వీరిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సాయికుమార్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కురుమూర్తి ప్రస్తుతం ఆసుపత్రిలో కోలుకుంటున్నాడు. సంఘటన తెలిసిన వెంటనే టూటౌన్, వన్‌టౌన్ సీఐలు ఇంతియాజ్, పవన్‌కుమార్‌లు సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. హత్య జరిగిన ప్రాంతం రెండు పోలీస్‌స్టేషన్‌లకు మధ్య బార్డర్‌గా ఉండటంతో కేసు కట్టే విషయంలో కొంత తర్జనభర్జన జరిగి ఎట్టకేలకు వన్‌టౌన్ పోలీసులకు కేసు అప్పగించారు. సీఐ పవన్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం అర్ధరాత్రంతా హంతకుల కోసం గాలించారు. సోమవారం రాత్రి వరకు కూడా రోజా వీధి దగ్గర నుంచి హత్య జరిగిన ప్రాంతం ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. సీసీ కెమెరాల్లో ఆటో నెంబరు నమోదైందేమోనని చూస్తున్నారు. సాయికుమార్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మేనమామ (కురుమూర్తి) తండ్రికి అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పవన్ కుమార్ తెలిపారు.

ఆటోలో కత్తులు!

ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఘటనను పరిశీలిస్తే.. ఆటోలో కత్తులు పెట్టుకోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇలా ఆటోలో కత్తులు పెట్టుకుని తిరగడంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల కాలంలో ఆటోలపై పోలీసులు తనిఖీలు పూర్తిగా మరిచిపోయారని, నిరంతరం తనిఖీలు చేస్తే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని పలువురు పేర్కొంటున్నారు. ఆటోలో కత్తులు లేకపోయి ఉంటే.. దెబ్బల వరకే గొడవ జరిగి ఉండేదని పలువురు భావిస్తున్నారు.

మల్టీ యుటిలిటీ సెంటర్‌కు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న అతిథులు



వైద్యులతో వాగ్వివాదం చేస్తున్న ఫోరెన్సిక్ వైద్యులు

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 26: మల్టీ యుటిలిటీ సెంటర్‌కు సోమవారం ఉదయం భూమి పూజ చేశారు. ముఖ్యఅతిథి గా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వి.వెంకటరంగారెడ్డి, కర్నూలు మెడికల్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.కె.చిట్టినరసమ్మ, ప్రభుత్వ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.పృథ్వీ వెంకటేశ్వర్లు, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.ప్రభాకర్ రెడ్డి తదితరులు హాజరై భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.సాయిసుధీర్, అమెరికా నుంచి వచ్చిన కేఎంసీ చైర్మన్ డా.సదాశివరెడ్డి, హైదరాబాదు నుంచి కేఎంసీ గ్రాడ్యుయేట్స్ ట్రస్టు తరుపున సెక్రటరీ డా.ఎ.రామలింగారెడ్డి, డా.అమానుల్లా, కేఎంసీ అల్యూమిని అసోసియేషన్ తరుపున ప్రెసిడెంట్ డా.బి.కుమారస్వామి రెడ్డి, సెక్రటరీ డా.బి.బాలమద్దయ్య, ట్రెజరర్ డా.ఎం.మహేశ్వరరెడ్డి, డా.కేజీ గోవిందరెడ్డి పాల్గొన్నారు.

భూమి పూజపై వివాదం

కర్నూలు మెడికల్ కాలేజీ మైదానంలో మల్టీ యుటిలిటీ సెంటర్ భూమి పూజ రసాభాసగా మారింది. కొందరు వైద్యులు, విద్యార్థులు భూమి పూజ కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. ప్రభుత్వం కేటాయించిన 60 సెంట్ల స్థలంలో మల్టీ యుటిలిటీ సెంటర్ నిర్మాణం భూమి పూజపై వైద్యులు రెండు వర్గాలుగా విడిపోయాయి. వంద ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ ఆసపత్రి, కర్నూలు మెడికల్ కాలేజీలో ఐదెకరాలు ఉన్న మైదానంలో యుటిలిటీ సెంటర్, స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఎలా కడతారని కొందరు వైద్యులు ప్రశ్నించారు. దీని వల్ల భవిష్యత్తు తరాల అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుందని ఫోరెన్సిక్ బ్రహ్మాజి మాస్టర్, అసోసియేట్ ప్రొఫెసర్ రంగయ్య ప్రశ్నించారు. మైదానంలో సెంటర్ నిర్మాణం వద్దనడంతో ఇరు వర్గాల వైద్యుల మధ్య వాగ్వివాదం జరిగింది. గ్రౌండులో సెంటర్ కడితే అది చిన్నదవుతుందని గొడవకు దిగారు.

తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్య

సంజామల, ఫిబ్రవరి 26: మండలంలోని వసంతాపురం గ్రామానికి చెందిన మేకల రామ్మోహన్, పద్మావతి దంపతుల చిన్న కూతురు మేకల అమృత (19) సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. అమృత నిత్యం సెల్‌ఫోన్‌లో కాలక్షేపం చేస్తుండడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో బెడ్ రూంలోకి పురుగుల మందుతాగి అపస్మారక స్థితికి వెళ్లింది. తల్లిదండ్రులు, బంధువులు అమృతను కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌రెడ్డి తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన




చనుగొండ్లలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో, కర్నూలులో పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల గురించి ఆరా తీస్తున్న కమిషనర్

గూడూరు, ఫిబ్రవరి 26: మండలంలోని చనుగొండ్ల గ్రామంలో 203 పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో శేషిరెడ్డి సోమవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రం ప్రస్తుతం పంచాయతీ కార్యాలయం బిల్డింగ్‌లో ఉండగా అది శిథిలావస్థలో ఉందని, దాని పక్కనే ఉన్న అంగన్‌వాడీ బిల్డింగ్‌లోకి మార్చేందుకు ప్రతిపాదనలు పంపామని ఆర్డీవో తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో కరెంట్, ఫర్నీచర్, నీటి వసతులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ ఉదయ్ సంతోష్, వీఆర్‌వోలు ఉన్నారు.

సి.బెళగల్: మండలంలోని పోలకల్లు గ్రామంలోని 141వ పోలింగ్ కేంద్రాన్ని పక్క గదిలోకి మార్చాలని కర్నూలు ఆర్డీవో అధికారులకు సూచిం చారు. సోమవారం మండలంలోని పోలకల్లు గ్రామంలో స్పెషల్ స్కూల్‌లో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆర్డీవో వెంట డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, పోలింగ్ అధికారులు రఫి, తిమ్మన్న ఉన్నారు.

కర్నూలు(కల్చరల్): పోలింగ్ కేంద్రాలను ఓటర్ల నివాసానికి సమీపంలో ఉన్న భవనాలకు మార్చాలని రాజకీయ పార్టీలు చేసిన అభ్యర్థనలను పరిగణిస్తూ సోమవారం కర్నూలు నియోజక వర్గం (137) ఎన్నికల అధికారి, నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవతేజ ఆయా పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్నాయో లేదో పరిశీలించారు. సంబంధిత బూత్ లెవల్ అధికారులతో మాట్లాడుతూ ఈ ప్రతిపాదిత భవనాలు అక్కడి ఓటర్ల నివాసా నికి సమీపంలోనే ఉన్నాయా, ఉన్నట్లయితే వీల్‌చైర్ ర్యాంప్, టాయిలెట్లు, విద్యుత్ తదితర సౌకర్యాలు ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, కర్నూలు అర్బన్ తహసీల్దారు మోహన్‌కుమార్, ఎలక్షన్ డీటీ ధనుంజయ, మున్సిపల్ డీఈలు, ఏఈలు, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

దూపాడులో అండర్ రైల్వే బ్రిడ్జి పనులు ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ



దూపాడు రైల్వేబ్రిడ్జి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రైల్వే అధికారులు, నాయకులు

కల్లూరు, ఫిబ్రవరి 26: కల్లూరు మండల పరిధిలోని దూపాడు రైల్వేస్టేషన్ సమీపంలోని అండర్ రైల్వేబ్రిడ్జి నిర్మాణాన్ని భారతప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. సోమవారం 'అమృత్ భారత్ స్టేషన్ పథకం'లో భాగంగా దేశవ్యాప్తంగా 1500 ఫ్లైఓవర్లు, అండర్ పాస్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రధాని శంకుస్థాపన చేశారు. దూపాడులో వేన్యూ సూపర్‌వైజర్, స్టేషన్ మేనేజర్ కురువ యల్ల సంజన్న ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ అక్బర్, కర్నూలు మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, కర్నూలు ఎంపీ వెంకటేశ్వరమ్మ, బీజేపీ నాయకులు నగరూరు రాఘవేంద్ర, దిన్నెదేవరపాడు సర్పంచు మాధవస్వామి, ఎంపీటీసీలు మద్దిలేటి, రామ్‌నాథ్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ రైల్వేశాఖలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. రైళ్లలో ప్రయాణించే వారికి మెరుగైన వసతులు అందించేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్‌రెడ్డి, శ్రీరాములు యాదవ్, రామాంజనేయులు, లోకేశ్వరయ్య, భగత్, గోపాల్, ఈరన్న, జయశ్రీ, రాజేశ్వరి, అనిత తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే మానవాళి మనుగడ



సమావేశానికి హాజరైన అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 26: ప్రకృతి వ్యవసాయంతోనే మానవాళి మనుగడ సాధ్యమని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు రాష్ట్ర అధికారి విజయ్ కుమార్ అన్నారు. సోమవారం విజయవాడలోని జిల్లా మహిళా సమాఖ్య పదాధికారులకు (ఆఫీస్ బేరర్స్) విజయవాడ సెర్ప్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ అధ్యక్షతన జరిగిందని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్, కన్సల్టెంట్ లక్ష్మయ్య, డీపీఎం నరసమ్మ తదితరులు తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమానికి ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి జిల్లా మహిళా సమాఖ్యల పదాధికారులంతా హాజరయ్యారని అన్నారు. కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల జిల్లాల సమాఖ్య ప్రతినిధులతో పాటు కార్యనిర్వాహక సభ్యులు, మండల సమైక్య ఆఫీస్ బేరర్లు, సెర్ప్ ప్రాజెక్టు డైరెక్టర్ డీపీఎంలు, జిల్లా కార్యాలయ సిబ్బంది, ఏపీఎంలు, రైతు సాధికార సంస్థ జిల్లా కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

2న మహిళల హాకీ జట్టు ఎంపిక

కర్నూలు(స్పోర్ట్స్), ఫిబ్రవరి 26: మహిళల హాకీ జట్టు ఎంపిక మార్చి 2న మధ్యాహ్నం 12 గంటలకు నంద్యాల ఎస్‌పీజీ హైస్కూల్‌లో ఎంపిక కార్యక్రమం ఉంటుందని ఉమ్మడి జిల్లాల కర్నూలు జిల్లా కార్యదర్శి దాసరి సుధీర్ సోమవారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారిణులు కర్నూలు జిల్లా జట్టు మార్చి 8వ తేదీ నుంచి 11 వరకు ప్రకాశం జిల్లాలో జరిగే 14వ హాకీ ఆంధ్రప్రదేశ్ మహిళల రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ప్రవేశ రుసుం రూ.10, ఆధార్ కార్డు, 2 ఫొటోలతో, పుట్టిన తేదీ సర్టిఫికెట్‌తో హాజరు కావాలన్నారు. వివరాలకు 9966565317ను సంప్రదించాలని సూచించారు.

ఆకెపోగుకు టీడీపీ నాయకుల పరామర్శ

గూడూరు, ఫిబ్రవరి 23: టీడీపీ కోడుమూరు టికెట్ రాకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన పార్టీ నాయకుడు ఆకెపోగు ప్రభాకర్‌ను పార్టీ యువ నాయకుడు కోట్ల రాఘవేంద్ర రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఎల్ సుధాకర్ రెడ్డి సోమవారం పరామర్శించారు. తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆకెపోగు ప్రభాకర్‌ను వారు పరామర్శించారు.

రేపు పట్టుబడిన వాహనాల వేలం

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 26: స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో శాఖ వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను ఈనెల 28న వేలం వేస్తున్నట్లు సీఐ కేఆర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే వేలంలో పాల్గొన దలచిన వారు రూ.5వేలు ప్రవేశ రుసుం చెల్లించి వేలం పాటల్లో పాల్గొనాలన్నారు. వివరాలకు స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ కర్నూలు స్టేషన్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు

నేడు రైతుబజార్‌లో క్లీన్ అండ్ గ్రీన్

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 26: నగరంలోని సి.క్యాంపు రైతుబజారులో మంగళవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని, అందువల్ల కూరగాయల క్రయ విక్రయాలు జరగవని ఎస్టేట్ అధికారి హరీష్ కుమార్, అసిస్టెంట్ శివకుమార్ తెలిపారు. రైతులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని రైతుబజారుకు విక్రయానికి కూరగాయలు తీసుకు రావద్దని వారు విజ్ఞప్తి చేశారు.

ట్రాఫిక్ సిగ్నల్స్, సెన్సార్ కెమెరాలను తొలగించాలి

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 26: నగరంలో అవసరం లేని చోట ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్, సెన్సార్ కెమెరాలను తొలగించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం డిమాండ్ చేశారు. సోమవారం స్పందనలో జిల్లా రెవెన్యూ శాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి, నగర నాయకులు కె.మధుసూదన్, కె.శ్రీనివాసులు మాట్లాడుతూ నగరంలో అవసరానికి మించి ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడం వల్ల వాహనాలు ఎక్కడి అక్కడే నిలిచిపోయి మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

టీడీపీ శ్రేణుల సమావేశం



మాట్లాడుతున్న రామాంజనేయులు

గూడూరు, ఫిబ్రవరి 26: గూడూరులో నగర పంచాయతీ మాజీ వైస్ ఛైర్మన్ కురుకుంద రామాంజనేయులు ఆధ్వర్యంలో టీడీపీ నాయ కులు, కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కురుకుంద రామాంజనేయులు మాట్లాడుతూ కోడుమూరులో టీడీపీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్లు బుడ్డంగలి, కోడుమూరు షాషావలి, సృజన్, పౌలు, విజయ్ కుమార్, విష్ణుసేన పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు



పోటీల్లో తలపడుతున్న జట్లు

కోడుమూరు, ఫిబ్రవరి 26: చౌడేశ్వరిదేవి జాతర సందర్భంగా 1979-1980 సంవత్సరం పదో తరగతికి చెందిన పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. స్థానిక జీవీఆర్ జడ్పీ హైస్కూల్ మైదానంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ పోటీలను పూర్వవిద్యార్థి రషీద్, ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షులు ఇంతియాజ్ బాషా ప్రారంభించారు. ఈ పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 16 జట్లు వచ్చాయి. మొదటి బహుమతి రూ.20వేలు ఇ.తాండ్రపాడు జట్టు, రెండో బహుమతి రూ.10వేలు కోడుమూరు జట్టు, మూడో బహుమతి రూ.5వేల నగదును బనగానపల్లె జట్టు గెలుచుకున్నాయి. క్రీడాకారులను ఎస్ఐ బాల నరసింహులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తైమూర్‌బాషా, పీఈటీ సురేంద్రనాయుడు, నాగేశ్వరరావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గ్రానైట్ తవ్వకాలు జరిపితే చర్యలు



అక్రమ తవ్వకాలను పరిశీలిస్తున్న గనుల శాఖ అధికారులు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 26: అక్రమంగా గ్రానైట్ తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ అన్నారు. సోమవారం కోడుమూరు, క్రిష్ణగిరి మండలాల సరిహద్దుల్లో అక్రమంగా గ్రానైట్ తవ్వకాలు జరుగుతున్నట్లు ఫిర్యాదు రావడంతో తనిఖీలు చేశారు. గోరంట్ల గ్రామంలో సర్వే నెంబర్ 467 తవ్వకాలు చేపడుతూ క్రిష్ణగిరి మండలం పుట్లూరు గ్రామం మారెమ్మ ఆలయానికి గ్రానైట్ తరలిస్తున్నారని విచారణలో తేలిందని చెప్పారు. తవ్వకాలకు ఉపయోగిస్తున్న ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేశామని తెలిపారు. ఉల్లిందకొండ వద్ద రోడ్డు మెటల్ లారీని, కర్నూలు నగర శివారులో రెండు గ్రావెల్ లారీలను సీజ్ చేసి అపరాధ రుసుం రూ. 60 వేలు వసూలు చేశామని తెలిపారు. ఈ దాడుల్లో మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా తిరుగు రథోత్సవం

కోడుమూరు, జనవరి 26: పట్టణంలో చౌడేశ్వరిదేవి అమ్మవారి జాతర సందర్భంగా సోమవారం అమ్మవారి తిరుగు రథోత్సవాన్ని పోలీసుల బందోబస్తు మధ్య నిర్వహించారు. తిరుగు రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో పట్టణంలోని వీధులు జనసంద్రోహంగా మారింది. తిరుగు రథోత్సవం అనంతరం భక్తులు దేవాలయంలోని అమ్మవారి దర్శనం కోసం బారీలు తీరారు. ఆటగారి దేవాంగ దైవాచార సంఘం సభ్యులకు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

కుంటలకు తాగునీరు వదలండి

సి.బెళగల్, ఫిబ్రవరి 26: మండలంలోని నీటి కుంటలకు తాగునీరు వదలాలని క్రిష్ణదొడ్డి, బురాన్‌దొడ్డి, బ్యాతోలి గ్రామాల ప్రజలు సోమవారం స్పందనలో ఎంపీడీవో శకుంతలకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని ఎంపీడీవో తెలిపారు. అలాగే గ్రామాల్లోని బోర్లు, బావులకు మరమ్మతులు చేపడుతున్నట్లు గ్రామస్థులకు ఆమె వివరించారు.

ఎస్ఐగా హనుమంతయ్య

గూడూరు, ఫిబ్రవరి 23: గూడూరు నూతన ఎస్ఐగా ఎన్ హనుమంతయ్య సోమవారం పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతకు ఎవ్వరైనా విఘాతం కల్గిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రానున్న ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలన్నారు.

'పేదలకు అండగా సీపీఐ'

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 26: పేదలకు సీపీఐ ఎప్పుడూ అండగా నిలుస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అన్నారు. సోమవారం సీఆర్ భవన్‌లో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే జగన్నాథం, పంపన్నగౌడ్, నగర కార్యదర్శి పీ రామకృష్ణారెడ్డి, నగర కార్యవర్గ సభ్యుడు సోమన్నలతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల కోసం సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి: ఎస్టీయూ

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 26: సార్వత్రిక ఎన్నికల్లో క్యాన్సర్, మానసిక అనారోగ్యం, గుండె జబ్బులు, ఊపిరితిత్తులు, మూత్రపిండాల వ్యాధులతో బాధ పడుతున్న ఉపాధ్యాయులకు, అంగవైకల్యం, 60 సంవత్సరాలు పైబడిన వారికి, చంటి పిల్లలు కలిగిన మహిళా ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావుకు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో హుసేన్ మియా, ముర్తుజావలి ఉన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి: విష్ణు



విష్ణు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

కర్నూలు(రూరల్), ఫిబ్రవరి 26: గ్రామ స్థాయిలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ కోడుమూరు సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గూడురు మండలం జులకల్ గ్రామం వైసీపీకి చెందిన 20 కుటుంబాలు సోమవారం కర్నూలులో విష్ణువర్ధన్‌రెడ్డి, బొగ్గుల దస్తగిరి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా విష్ణు వారికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కలిసి కట్టుగా పనిచేసి టీడీపీ అభ్యర్థి దస్తగిరిని గెలిపించి చంద్రబాబుకు బహుమతిగా అందిస్తామన్నారు. టీడీపీలో చేరిన వారిలో రవి, శ్రీనివాసులు, బజారి, మిన్నెల్లా, నాగమద్ది, రంగన్న, మల్లికార్జున, లక్ష్మన్న, రంగన్న, వెంకటేష్, ఈరన్న, పాపన్న, వినోద్, రాముడు పాల్గొన్నారు.

కిచెన్ షెడ్డు ప్రారంభం

కోడుమూరు(రూరల్), ఫిబ్రవరి 26: మండలంలోని అమడగుంట్ల ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కిచెన్ షెడ్డు, డైనింగ్ హాల్‌ను దాత రిటైర్డ్ ఇంజనీర్ క్రిష్టారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఆయా నిర్మాణాలకు సుమారు రూ.1.72 లక్షలు ఖర్చు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం అనంతయ్య యాదవ్, ఉపాధ్యాయులు దాతను ఘనంగా సన్మానించారు.

'పంటలకు మద్దతు ధర కల్పించాలి'



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 26: పంటలకు మద్దతు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, కే జగన్నాథం డిమాండ్ చేశారు. ఇటీవల న్యూఢిల్లీలో కేంద్ర కార్మిక, కర్షక సంఘాలు ఇచ్చిన పిలుపుతో ఢిల్లీలో రైతులు జరుపుతున్న ఉద్యమానికి సంఘీభావంగా సోమవారం కార్మిక, కర్షక సంఘాల నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రభాకర్‌రెడ్డి, జగన్నాథంలు హాజరై మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతుల ఉద్యమాన్ని అణచివేయడానికి ఎన్నో ప్రయత్నాలు చేసిందని, కేంద్ర బలగాలను ఉపయోగించి రబ్బర్ బుల్లెట్లు ఉపయోగించి కాల్పులు జరపడం ద్వారా ఐదుగురు రైతులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో బీజేపీ ప్రభుత్వానికి రైతులే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. మోదీ ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ కమిటీ సిఫారసులు అమలు చేయాలని, 2022 విద్యుత్ రంగ ప్రైవేటీకరణ బిల్లును రద్దు చేయాలని, ఉచిత విద్యుత్ విధానాన్ని అమలు చేయాలని, రైతుల మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించరాదని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మునెప్ప, అంజిబాబు, పంపన్న గౌడ్, నరసింహులు, చంద్రశేఖర్, శ్రీనివాసరావు, నాగన్న, సురేంద్ర యాదవ్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

జయహో బీసీ సభకు తరలిన నాయకులు



నంద్యాలకు తరలివెళ్తున్న టీడీపీ నాయకులు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 26: నంద్యాల పట్టణంలో జరిగే జయహో బీసీ సభకు టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో ఓర్వకల్లు గ్రామం నుంచి సోమవారం సాయంత్రం భారీగా టీడీపీ నాయకులు తరలివెళ్లారు. మండలంలోని కన్నమడకల, పూడిచెర్ల, నన్నూరు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, సోమయాజులపల్లె, కొమరోలు, హుశేనాపురం, కాల్వ, మీదివేముల, చెన్నంచెట్టిపల్లె, బైరాపురం గ్రామాల నుంచి దాదాపు 30 వాహనాల్లో జయహో బీసీ మహాసభకు తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు అల్లాబాబు, గౌస్, రామాంజనేయులు, బత్తుల వెంకటరమణ, యాసిన్‌బాషా పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి



స్పందనలో వినతి పత్రం అందజేస్తున్న వెంకటేశ్వర్లు

కోడుమూరు(రూరల్), ఫిబ్రవరి 26: మండలంలోని అమడగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని లోక్‌సభ టీడీపీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరి గిన స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు దాతలు అందించిన సుమారు రూ.2లక్షల వడ్డీతో ఏటా ప్రతిభ కనబరచిన విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున నగదు పురస్కారం అందించేవారని తెలిపారు. ఉపాధ్యాయులు వడ్డీ సొమ్ముతో 2009 సంవత్సరం నుంచి విద్యార్థులను ప్రోత్సహిస్తూ వచ్చారని తెలిపారు. అయితే గతేడాది ఆగస్టు 15న విద్యార్థులకు ప్రోత్సాహకం ఇవ్వలేదన్నారు. గతంలో పని చేసిన ఉపాధ్యాయులు నిధులు అప్పగించకుండా బదిలీ అయ్యారని తెలిపారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అర్జీలను త్వరగా పరిష్కరించండి: కమిషనర్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 26: స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చే అర్జీలను త్వరగా పరిష్కరించాలని కార్పొరేషన్ కమిషనర్ భార్గవ తేజ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని పాత కౌన్సిల్ హాలులో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అర్జీదారుల నుంచి వచ్చిన వినతులను ఆయన స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్ఈ వేణుగోపాల్, హెల్త్ ఆఫీసర్ విశ్వేశ్వర్‌రెడ్డి, మేనేజరు చిన్న రాముడు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

రాష్ట్ర కబడ్డీ జట్టులోకి ఆదోని కుర్రాడు

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 26: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఆదోని పట్టణంలో అరుణ్‌జ్యోతి నగర్‌కు చెందిన అరుణ్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ నెల 25న కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో జరిగిన జట్టు ఎంపికలో స్థానం కల్పించినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ, సహాయ కార్యదర్శి అమర్ ప్రకాష్ తెలిపారు.

పట్టాలు ఇస్తే ఆత్మహత్యలే శరణ్యం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పాలకొలను బాధితులు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 26: పేదలు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూముల్లో రాజకీయ కక్షతో వైసీపీ నాయకులు ఇంటి స్థలాలకు పట్టాలు ఇచ్చారని, ఆ పొలాల్లో పట్టాలు ఇస్తే ఆత్మహత్యలు చేసుకుంటామని బాధిత రైతు మహి ళలు హెచ్చరించారు. సోమవారం కర్నూలు నగరంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం స్పందనలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకొలనులో పేద రైతులు సాగు చేసుకుంటున్న భూముల వద్దకు మధ్యాహ్నం ఈవోఆర్డీ సుబ్బరాయుడు, ఆర్ఐ రంగస్వామి, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, పోలీసులు వచ్చి పొలంలో పొగాకు బేడ్లు ఎండ పెట్టకూడదని చెప్పారు. దీంతో తాము పురుగుల మందు తాగి ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటామని తేల్చి చెప్పడంతో అధికారులు వెనుదిరిగారు.

టీడీపీ నాయకులను కలిసిన బొగ్గుల దస్తగిరి




కేఈ ప్రభాకర్, కోట్ల కవితమ్మలకు పూల బోకే ఇస్తున్న బొగ్గుల దస్తగిరి

కర్నూలు(రూరల్), ఫిబ్రవరి 26: టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, పార్టీ కోడుమూరు మండల కన్వీనర్ కోట్ల కవితమ్మను కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి సోమవారం కర్నూలులో పూల బోకే ఇచ్చి మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో తన గెలుపునకు సంపూర్ణ సహకారం ఇవ్వాలని దస్తగిరి వారిని కోరారు. అందరిని కలు పుకొని ముందుకు వెళ్లాలని వారు సూచించారు. అనంతరం సీనియర్ మాజీ మంత్రి రాంభూపాల్ చౌదరి తనయుడు నవీన్‌చౌదరి, టీడీపీ రాష్ట్ర కార్య దర్శి రాంపుల్లయ్య యాదవ్, నరసింహులు యాదవ్‌ను దస్తగిరి మర్యాద పూర్వకంగా కలిశారు.

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను నిర్వహించండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్వో మధుసూదన్‌రావు

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 26: ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మధుసూదన్‌రావు అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు 2024 పోస్టర్‌లను డీఆర్వో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నెలలో రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఈనెల 28న మున్సిపల్ హైస్కూల్, ఎమ్మిగనూరు స్కూల్ విద్యార్థులకు క్విజ్ పోటీలు, 29న కేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ (మహిళలు) వారికి క్రాస్వర్డ్ పోటీలు ఆర్థిక అక్షరాస్యతపై నిర్వహిస్తామని తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

ఓర్వకల్లు, ఫిబ్రవరి 26: ఓర్వకల్లులోని బైరెడ్డి కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న ఆధ్వర్యంలో స్పందనలో ఎంపీడీవో మల్లేశ్వరికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైరెడ్డి కాలనీలో గత రెండు నెలలుగా తీవ్రమైన నీటి సమస్య ఉందన్నారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. నరసమ్మ, మాసూం బాషా పాల్గొన్నారు.



అధికారులకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

రాష్ట్ర కబడ్డీ జట్టులోకి ఆదోని కుర్రాడు


అరుణ్ కుమార్

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 26: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఆదోని పట్టణంలో అరుణ్‌జ్యోతి నగర్‌కు చెందిన అరుణ్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ నెల 25న కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో జరిగిన జట్టు ఎంపికలో స్థానం కల్పించినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ, సహాయ కార్యదర్శి అమర్ ప్రకాష్ తెలిపారు. మార్చి 10 నుంచి నెల్లూరు జిల్లా కొవ్వూరులో జరిగే రాష్ట్ర కబడ్డీ పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

ఆలూరు ఎంఈవోపై చర్యలు తీసుకోవాలి

ఆలూరు, ఫిబ్రవరి 26: అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఆలూరు మండల విద్య శాఖాధికారి కోమలదేవిపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ యునైటెడ్ స్టూడెంట్ ఫెడరేషన్, రాష్ట్ర కార్యదర్శి షాహిద్, జిల్లా అధ్యక్షుడు రఘు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందిస్తున్నారని, ఇందుకోసం రవాణా ఖర్చు దాదాపు రూ.1.50 లక్షలు ఇచ్చిందన్నారు. కానీ ఎంఈవో కోమలదేవి ఆ నిధులను స్వాహా చేశారన్నారు. ఎంఈవోపై చర్యలు తీసుకొని పక్షంలో కలెక్టర్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు మనోహర్, ఆఫ్రిద్, చిన్న పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల తీరుపై నిరసన

హొళగుంద, ఫిబ్రవరి 26: తమ ఇంటి స్థలాలు రిజిస్ట్రేషన్ కోసం వెళితే కాలువ, రోడ్డుగా చూపిస్తున్నాయని ఆరవ వార్డు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 560/ ఏబీసీలో 90సెంట్ల స్థలం ఉందని, 50 ఏళ్లుగా జీవనం సాగిస్తున్నామని తెలిపారు. ఇదే స్థలంలో 200 ఇళ్లకు పైగా నిర్మించుకున్నామన్నారు. రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో కాలువ, రోడ్డుగా నమోదు చేయడంతో రిజిస్ట్రేషన్లు కావడం లేదన్నారు. అధికారులు స్పందించాలని వారు కోరారు. అనంతరం రీ-సర్వే డిప్యూటీ తహసీల్దార్ ముకుందరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈడిగ నరసింహ ప్రసాద్, మహేంద్ర, హనుమేష్, వెంకటేష్, వీరేష్, గాదిలింగ పాల్గొన్నారు.

కోట్లను కలిసిన ఆలూరు టీడీపీ నాయకులు

ఆలూరు, ఫిబ్రవరి 26: టీడీపీ సీనియర్ నేత, డోన్ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని కర్నూలులో సోమవారం ఆలూరు టీడీపీ నాయకులు కలిసి సన్మానించారు. టీడీపీ ఇన్‌చార్జి కోట్ల సుజాతమ్మతో సమావేశం అయ్యారు. చంద్రబాబును సీఎం చేయడమే అందరి లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో మరకట్టు సర్పంచు ఎల్లప్ప, జిల్లా నాయకులు నరసప్ప, సోమశేఖర్, నాయకులు ముద్దురంగ, గుళ్యం రామాంజినేయులు, మసాల జగన్, ఉలిగప్ప, గోవింద్ హనుమప్ప పాల్గొన్నారు.

29న ముస్లిం మహా గర్జన

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 26: రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా ముస్లిం హక్కుల సాధన కోసం ఈ నెల 29న ఆదోనిలో మహాగర్జనను నిర్వహిస్తున్నట్లు ఎంఆర్‌పీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ షేక్ మహబూబ్ బాషా అన్నారు. సోమవారం పెద్ద మసీదు వెనక వైపు ఉన్న మసూరియా ఉన్నత పాఠశాల మైదానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మహాగర్జనపై రాజకీయ సంబంధం లేకుండా ముస్లిం ఉనికి కోసం, తమ భవిష్యత్తు కోసం మహాగర్జనను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

గ్రామాభివృద్ధి అందరి బాధ్యత

గోనెగండ్ల, ఫిబ్రవరి 26: గ్రామాభివృద్ధి గ్రామంలోని ప్రజలందరి బాధ్యత అని పంచాయతీ కార్యదర్శి సతీష్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని పలు వీధిలో పరసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. కాలువలో నిండిన చెత్తను, ముళ్ల పొదలను ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాయలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామంలో ఇంటి పన్నులు, కొళాయి పన్ను, దుఖానాల పన్నులు మార్చి నెల చివరి లోపు వందశాతం వసూళ్ల చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

మంత్రాలయం, ఫిబ్రవరి 26: మాధవరం గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని గ్రామ కార్యదర్శి వేణుగోపాల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పవన్‌కుమార్ అన్నారు. సోమవారం నది ఒడ్డున ఉన్న పంపు ద్వారా తుంగభద్ర నదిలోకి పంపింగ్ చేసి అక్కడి నుంచి ఓవర్‌హెడ్ ట్యాంకుకు సరఫరా చేసి గ్రామాలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు జంగం వీరన్నస్వామి, గౌళ్ల వీరారెడ్డి, భీమిరెడ్డి, తిరుమల వెంకటేశ్వరరావు, రంగస్వామి, జయరాము, డీజే రాజు, గోభి నరసింహులు, ముత్తన్న, దేవిరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీమ కాపు కార్పొరేషన్ పరిశీలకుడిగా వైపీ వీరన్న

మద్దికెర, ఫిబ్రవరి 26: మద్దికెరకు చెందిన సౌత్ ఇండియా కాపు కార్పొరేషన్ జిల్లా అధ్యక్షుడు వైపీ వీరన్నను సౌత్ ఇండియా కార్పొరేషన్ తరుపున రాయలసీమకు పరిశీలకులుగా నియమించారు. సోమవారం సౌత్ ఇండియా కాపు కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెల్పూరి శ్రీనివాసరావు ఉత్తర్వులు పంపారు. ఈ సందర్భంగా వైపీ వీరన్న విలేకరులతో మాట్లాడారు. కాపుల కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. కాపులంతా ఐక్యంగా జనసేన, టీడీపీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు.

స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించండి


స్పందనలో వచ్చిన అర్జీలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ఆదోని, ఫిబ్రవరి 26: స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్‌లోని ఆయా ప్రాంతాల ప్రజలు నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు.

మండలాల నుంచి వచ్చిన అర్జీలు కొన్ని..

● నందవరం మండలం ఇబ్రహింపురం గ్రామానికి సంబంధించి సర్వే నెం. 304/ఏ-2లో 1.39 ఎకరాల భూమిని కొందరు ఆక్రమించారని, తమ సమస్యను పరిష్కరించి ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేసి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని బాధితులు అర్జీ సమర్పించారు.

● నందవరం మండలం నదికైరవాడి గొల్లబాబుకు సంబంధించి సర్వే నెం.187/సీలో 2.00 ఎకరాల భూమి కొనుగోలు ద్వారా సంక్రమించిందని, ప్రస్తుతం ఈ భూమిని ఆన్‌లైన్‌లో తన పేరును నమోదు చేయాలని అర్జీ సమర్పించారు.

● కౌతాళం మండలం బాపురం గ్రామానికి చెందిన లక్ష్మీదేవమ్మకు సంబంధించి సర్వే నెం. 90లో 2.24 ఎకరాల భూమి కొనుగోలు ద్వారా సంక్రమించిందని, డాక్యుమెంట్ నెం. 699/1970లో రిజిస్టర్ చేశారని, ప్రస్తుతం సదరు భూమి రిజిస్ట్రేషన్ కోసం వెళ్లినప్పుడు దేవదాయ భూమిగా చూపుతోందని, విచారణ చేసి సమస్యను పరిష్కరించాలని అర్జీ సమర్పించారు.

● ఆదోని మండలం ఇస్వీ గ్రామానికి చెందిన మాదిగ నరసమ్మకు సంబంధించి సర్వే నెం. 429/బీ-3లో 1.95 ఎకరాల భూమి ప్రభుత్వం నుంచి సంక్రమించింది. ఈ భూమిలో సుమారు 20 సంవత్సరాలు పైగా అనుభవంలో ఉన్నాం. ప్రస్తుతం ఈ భూమి నిషేధిత జాబితాలో కనిపిస్తోంది. విచారణ చేసి నిషేధిత జాబితా నుంచి తొలగించాలని అర్జీ సమర్పించారు.

రైతులపై కాల్పులు అమానుషం

పంట ఉత్పత్తులకు మద్దతు ధర ఇవ్వాలని ఢిల్లీలో ధర్నా చేస్తున్న రైతులపై మోదీ ప్రభుత్వం కాల్పులు చేయడం అమానుషమని సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీల నాయకులు అన్నారు. ఢిల్లీలో రైతుల పోరాటానికి సంఘీభావంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా రైతు, కార్మిక సంఘాలు, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ నాయకులు నిరసన ప్రదర్శనలు చేశారు. కాల్పులు విరమించి వెంటనే రైతు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.


రైతులకు సంఘీభావంగా పత్తికొండలో బైక్ ర్యాలీ

ఎమ్మిగనూరు రూరల్/ఆలూరు/హొళగుంద/పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 26: జాతి సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్న బీజేపీ డౌన్‌డౌన్ అని నినదిస్తూ సోమవారం ఎమ్మిగనూరు పట్టణంలో కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో బైకు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో బైకు ర్యాలీ చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి, మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సోమప్ప సర్కిల్‌లో నాయకులు రామాంజనేయులు, గోవిందు, తిమ్మగురుడు, వీరేష్, ప్రసాద్, యేసేపు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో రెండవ దఫా రైతాంగ పోరాటాన్ని ప్రారంభించారని, ఈ పోరాటాన్ని అణచేందుకు మోదీ ప్రభుత్వం విచక్షణా రహితంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ర్యాలీలో నాయకులు రంగన్న, భాస్కర్‌యాదవ్, చినన్న, రాముడు, సురేష్, ఆంథోని, దాదావలి, సమీఉల్లా, మల్లికార్జునగౌడు, ఆజాద్, సుంకన్నలు పాల్గొన్నారు.

ఆలూరులో బైక్ ర్యాలీ

ఢిల్లీలో రైతు పోరాటానికి సంఘీభావంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆలూరు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ సర్కిల్ వద్ద ధర్నా చేశారు. సీపీఐ మండల కార్యదర్శి పి.రామాంజనేయులు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణస్వామి, సీపీఎం మండల కార్యదర్శి షాకీర్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర కల్పిస్తామని, స్వామినాథన్ సిఫారసులు అమలు చేస్తామని హామీ ఇచ్చి ఏడాది గడిచినా హామీ నెరవేర్చలేదని విమర్శించారు. హామీల అమలును కోరుతూ రైతులు ఆందోళన చేపడితే కాల్పులు జరిపి రైతులను బలిగొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి సీ గోపాల్, ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షులు పులి రంగన్న, రైతు సంఘం మండల కార్యదర్శి అగ్రహారం ఈరన్న, సీపీఎం హాలహర్వి మండల కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిరసన ప్రదర్శన

రైతులు పండించిన పంటకు మద్దతు ధర ఇవ్వాలని ఢిల్లీలో ధర్నా చేస్తున్న రైతులపై పోలీసుల కాల్పులు చేయడం అమానుషమని సీపీఐ, రైతు సంఘం, సీపీఎం, కాంగ్రెస్ నాయకులు పెద్దహ్యట్ట మారెప్ప, తిమ్మయ్య వెంకటేష్, అమాన్ అన్నారు. హొళగుందలోని వాల్మీకి సర్కిల్ నుంచి బస్టాండ్ వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. మోదీ రైతుల ఉద్యమాన్ని పోలీసులతో అణగదొక్కాలని చూడటం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో రంగన్న, కృష్ణ, శ్రీరంగ, నాగరాజు, మోదిన్, షబ్బీర్, మస్తాన్ పాల్గొన్నారు.

అన్నదాతల్ని చంపేస్తారా...?

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆందోళనలు చేపట్టిన అన్నదాతలను చంపేయడమే రామరాజ్యమా.. అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నబీరసూల్, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి కృష్ణయ్య, రైతు సంఘం తాలుకా అధ్యక్షుడు ఈరన్న, సీఐటీయూ నాయకులు వెంకటేశ్వరరెడ్డి ప్రశ్నించారు. పత్తికొండలో వామపక్ష కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు రైతులు సన్నద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో వామపక్ష ప్రజా సంఘాల నాయకులు ఉమాపతి, నెట్టికంటయ్య, పెద్దయ్య, ఆల్తాఫ్, కారుమంచి, వెంకట్రాముడు, దస్తగిరి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

● ఎన్నికల కమిషన్ ఆదేశాలను క్షుణ్ణంగా చదవండి

● సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ

ఆదోని, ఫిబ్రవరి 26: ఎన్నికల విధులపై అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ అన్నారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికలకు సంబంధించిన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఎప్పుడు వచ్చినా అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఎన్నికల విధుల పై ఎన్నికల కమిషన్ ఆదేశించిన అంశాలను క్షుణ్ణంగా చదివి వాటి అంశాల పై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికల ఆదేశాల మేరకు ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్‌టీ, వీవీటీ, వీఎస్‌టీ టీంలు పూర్తి స్థాయిలో శిక్షణ పూర్తి చేసుకొని ఎన్నికలకు సంసిద్ధం కావాలని పేర్కొన్నారు. మార్చి ఒకటవ తేదీ లోపు సెక్టోరల్, రూట్ ఆఫీసర్లకు వాహనాలకు సంబంధించిన ప్రక్రియ నివేదికలు పూర్తి చేయాలని ఆర్డీవో నాగేంద్ర, ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్ రఫీలను ఆదేశించారు.

ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోండి

● ఎంఈవోకు వినతి పత్రం అందించిన టీఎన్ఎస్ఎఫ్

పత్తికొండ, ఫిబ్రవరి 26 : ఇంగ్లీష్ మీడియం పేరిట అధిక ఫీజులు వసూలు చేయడంతో ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు చేపట్టాలని టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు మునినాయుడు ఎంఈవో రమేష్‌ను కోరారు. పత్తికొండ పట్టణంలో ఓ ప్రైవేటు పాఠశాల రెండో బ్రాంచి ఏర్పాటుచేసి ముందస్తు అడ్మిషన్లను చేపట్టిందని అన్నారు. విద్యార్థుల నుంచి అధిక ఫీజులను వసూలు చేస్తూ తల్లిదండ్రుల నుంచి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. నాయకులు బీటీ పవన్‌కుమార్, భాస్కర్‌నాయుడు, రమేష్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సింహగర్జన జయప్రదం చేయండి

వెల్దుర్తి, ఫిబ్రవరి 26 : పట్టణంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో సోమవారం మార్గదర్శి మండల దివ్యాంగుల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు రామగిడ్డయ్య మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం, సాధికారత కోసం ఈనెల 29న కర్నూలు ఎస్టీబీసీ కళాశాల మైదానంలో తలపెట్టిన దివ్యాంగుల సింహగర్జనను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీరాములు, శివశంకర్, రాజు, హనుమన్న, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్ర రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మంత్రాలయం, ఫిబ్రవరి 26: మంత్రాలయం మండలంలోని మంత్రాలయం రోడ్డు (తుంగభద్ర రైల్వేస్టేషన్) మౌలిక సదుపాయాల కల్పనకు రూ.3.58 కోట్లతో చేపట్టనున్న పనులకు వర్చువల్ విధానంలో ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. సోమవారం మంత్రాలయం రైల్వేస్టేషన్‌లో రైల్వే అధికారులు విష్ణువర్ధన్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, వంశిక్ అక్షయ్ కుమార్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. శిలాఫలకం ఆవిష్కరణ సందర్భంగా జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అమృత్ భారత్ పథకం కింద మంత్రాలయం ఎంపిక కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మంత్రాలయం సీఐ ఎరిషావలి, మాధవరం ఎస్ఐ క్రిష్ణమూర్తి, రైల్వే అధికారులు నాగార్జున, షాజిద్, సునీల్ కుమార్, సిద్దార్థ రెడ్డి, కాశీనాథ్, తదితరులు పాల్గొన్నారు.


తుంగభద్ర రైల్వేస్టేషన్‌లో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న అధికారులు

తప్పును సరిదిద్దుకున్న విద్యా కమిటీ చైర్‌పర్సన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆదోని రూరల్, ఫిబ్రవరి 26 : ఎట్టకేలకు నెట్టేకల్లు ప్రభుత్వ ఎంపీయూపీ పాఠశాల చైర్‌పర్సన్ సులోచన దంపతులు తమ తప్పును సరిదిద్దుకున్నారు. సులోచన విద్యా కమిటీ చైర్‌పర్సన్‌గా ఉండగా భర్త వైసీపీ నాయకుడిగా కొనసాగుతున్నారు. గ్రామ పాఠశాల విద్యా కమిటీ చైర్‌పర్సన్ పదవి చేజిక్కించుకున్న వెంటనే తమ కుమారుడిని ప్రభుత్వ పాఠశాల నుంచి ఓ ప్రైవేటు పాఠశాలలో చేర్పించారు. ఈ నెల 18న ఆంధ్రజ్యోతి పత్రికలో 'పదవి కోసం పాకులాట కథనం' ప్రచురించిన విషయం పాఠకులకు విదితమే. దీంతో జిల్లా విద్యా శాఖ అధికారుల మేరకు ఎంఈఓ శ్రీనివాసులు పాఠశాలను రెండు మార్లు తనిఖీ చేశారు. ఈ నెల 21వ తేదీన రాకేష్‌ను పాఠశాలలో 4వ తరగతి కింద జాయిన్ చేశారని ఎంఈఓ తెలిపారు. నేటి నుంచి సక్రమంగా గ్రామంలో ఉండే ప్రభుత్వ పాఠశాలకే తమ కుమారుడిని పంపుతామని, తమ పొరపాటును సరిదిద్దుకుంటామని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకుంటామని వారు లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారని ఎంఈఓ తెలిపారు. ఎంఈఓ వెంట హెచ్ఎం దిలీప్ కుమార్ తదితరులు ఉన్నారు.

నియోజకవర్గంలో పార్టీని నిలబెట్టింది బీవీ కుటుంబమే


ఎమ్మిగనూరులో విలేకరులతో మాట్లాడుతున్న బీసీ నాయకులు

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 26: దశాబ్దాల కాలంగా ఎమ్మిగనూరులో టీడీపీ కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటూ పార్టీని బలోపేతం చేసి నియోజకవర్గంలో టీడీపీని నిలబెట్టింది బీవీ కుటుంబమేనని టీడీపీ బీసీ సెల్ నాయకులు అన్నారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వీజీపీ దయాసాగర్, కౌన్సిలర్ రామకృష్ణ, మాజీ కౌన్సిలర్లు ముల్లా కలీముల్లా, రామకృష్ణ నాయుడు, రంగస్వామి గౌడ్, చేనేత మల్లి, అంజి, దేవేంద్ర, బిజ్జె నాగరాజు, మిన్నప్ప మాట్లాడారు. ఎమ్మిగనూరులో పార్టీ నాయకులు, కార్యకర్తలు బీవీ వెంటే ఉంటామని, ఎన్ని ట్రిక్కులు చేసినా టీడీపీ టికెట్టు బీవీ జయనాగేశ్వరరెడ్డికి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

నందవరం, ఫిబ్రవరి 26: మండల కేంద్రంలో జయహో బీసీ కార్యక్రమాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు డీవీ రాముడు ఆధ్వర్యంలో నిర్వహించారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముగతి ఈరన్న గౌడు, మాచాపురం కాశీంవలీ, ధర్మాపురం గోపాల్, గురురాజారావు మాట్లాడుతూ బీవీకే ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జగ్గాపురం నరసింహులు, నాగలదిన్నె ఈరన్న, టీఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు బాపురం బద్రినీలకంఠ, నదికైరవాడి వీరేష్ ఆదిశేషు పాల్గొన్నారు.

గోనెగండ్ల : బీవీ జయనాగేశ్వరరెడ్డి వైపే బీసీలు ఉన్నారని, ఆయన విజయానికి కృషి చేస్తారని గోనెగండ్ల మండల టీడీపీ నాయకులు అన్నారు. సోమవారం బీసీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ గాజులదిన్నె హనుమంతు, బేతాలబడేసా, గంజహళ్లి కృష్ణమనాయుడు, మండల కన్వీనర్ నజీర్‌సాహెబ్, ప్రధాన కార్యదర్శి తిరుపతయ్యనాయుడు, టౌన్ అధ్యక్షుడు రమేష్‌నాయుడు, రంగస్వామినాయుడు మాట్లాడుతూ బీసీ జయనాగేశ్వరరెడ్డి గ్రామాల్లో బీసీ లకు ఏ సమస్య వచ్చినా తక్షణమే స్పందించి పరిష్కారం చూపుతారని అన్నారు.

టెట్ భారం

● నిరుద్యోగులతో జగన్ ప్రభుత్వం ఆటలు

● సుదూర ప్రాంతాల్లో కేంద్రాలు

● నేటి నుంచి ఆరంభం కానున్న పరీక్షలు

ఆలూరు, ఫిబ్రవరి 26: ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించే టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) నిరుద్యోగులకు భారంగా మారింది. నోటిఫికేషన్ ఇచ్చిన పది రోజుల గడువులో పరీక్షలు నిర్వహించడంతో అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు వెళ్లాల్సిందే

టెట్ పరీక్ష కేంద్రాలు ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు కేటాయించడంతో నిరుద్యోగ అభ్యర్థులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. ఇప్పటికే టెట్, డీఎస్సీ కలిపి రూ.1500 చెల్లించారు. హైదరాబాద్, బెంగళూరు, రాష్ట్రాలతోపాటు ఇతర జిల్లాలకు పరీక్ష కేంద్రాలను వేయడంతో సుదూర ప్రాంతాలకు వ్యయప్రయాసలతో వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. సుదూర ప్రాంతాలకు వెళ్లాలంటే వేలల్లో ఖర్చు అవుతుందని వాపోతున్నారు.

హడావుడిగా పరీక్షలు

టెట్ పరీక్షల నోటిఫికేషన్‌ను ప్రభుత్వం హడావుడిగా జారీ చేయడంతో కనీసం పరీక్షకు సిద్ధమయ్యేందుకు సమయం సరిపోలేదని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

నేటి నుంచి ఆరంభం కానున్న టెట్ పరీక్షలు

ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) మంగళవారం నుంచి ఆరంభం కానున్నాయి. సుదూర ప్రాంతాల్లో సెంటర్లు పడిన అభ్యర్థులు సోమవారమే వ్యయ ప్రయాసలతో తరలి వెళ్లారు.

బాబు వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు : కేఈ


పత్తికొండలో యువకుడితో మాట్లాడుతున్న కేఈ శ్యాంబాబు

పత్తికొండ, ఫిబ్రవరి 26: ఒక్క అవకాశం పేరుతో అధికారం చేపట్టి వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని, తిరిగి బాబు అధికారంలోకి వస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని పత్తికొండ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన సోమవారం పత్తికొండ పట్టణంలోని 17వ వార్డులో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. ఇంటింటికి తిరుగుతూ మినీ మేనిఫెస్టో కరపత్రాల ద్వారా టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే పథకాల గురించి వివరించారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు నడుం బిగించాల్సిన సమయం ఆసన్నమైందని, టీడీపీకి ఓటు వేసి వైసీపీని గద్దె దించాలని ప్రజలను కోరారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక బూత్ ఇన్‌చార్జిలు ఉన్నారు.

భక్త కనకదాసు జీవితం మానవళికి ఆదర్శం


భక్త కనకదాసు విగ్రహ ప్రతిష్ఠలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

పెద్దకడుబూరు , ఫిబ్రవరి 26: భక్త కనకదాసు జీవితం మానవళికి ఆదర్శం అని మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిక్కారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామంలో భక్త కనకదాసు విగ్రహ ఏర్పాటు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుబలు భక్త కనకదాసు సాంప్రదాయాలను కొనసాగించాలని సూచించారు. టీడీపీ రైతు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి, మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న, నాయకులు మల్లికార్జున, దశరదరాముడు, వీరేష్ గౌడ్, గోపాల్ రెడ్డి, శివ, హనుమంతు, మహదేవ, దేవన్న, నాగప్ప పాల్గొన్నారు.

కంబదహల్‌లో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ

చిన్నతుంభళం గ్రామంలో వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వాల్మీకీ విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిక్కారెడ్డి, నాయకులు రమాకాంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పూజలు నిర్వహించారు. వాల్మీకి నాయకులు మల్దకల్, మునెప్ప, మురళి, నరసప్ప, పాల్గొన్నారు

శాప్‌నెట్ చైర్మన్‌గా మాచాని వెంకటేష్

ఎమ్మిగనూరు , ఫిబ్రవరి 26: సొసైటీ ఫర్ ఆంధ్రప్రదేశ్ నెట్‌వర్క్ రాష్ట్ర చైర్మన్‌గా ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన మాచాని వెంకటేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడలోని శాప్‌నెట్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఏడాది కాలం పాటు ఈయన చైర్మన్‌గా కొనసాగనున్నారు. కాగా మాచాని వెంకటేష్ ఎమ్మిగనూరు వైసీపీ సమన్వయ కర్తగా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సూచనలతో పార్టీ అధిష్టానం నియమించింది. అయితే పార్టీ జరిపిన సర్వేలో ఆశించిన స్థాయిలో ఫలితం రాకపోవడంతో ఆయన స్థానంలో మాజీ ఎంపీ బుట్టా రేణుకను ఎంపిక చేసింది. దీంతో మాచాని వెంకటేష్‌కు రాష్ట్ర స్థాయి చైర్మన్ పదవి ఇచ్చేందుకు హామీ ఇచ్చింది. ఇందులో భాగంగానే సాప్‌నెట్ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు.

అంత్యక్రియలకు వెళ్తూ రోడ్డు ప్రమాదం

● పది మందికి పైగా తీవ్ర గాయాలు

● ఒకరి పరిస్థితి విషమం

హొళగుంద, ఫిబ్రవరి 26: సులువాయి గ్రామానికి చెందిన పింజారి గుడు సాబ్ 20 మందితో కలిసి కర్ణాటకలోని తమ బంధువు అంత్యక్రియలకు టెంపో (టాటా ఏస్)లో వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. గుడు సాబ్ వివరాల మేరకు.. కర్ణాటకలోని కంప్లీ క్యాంప్‌కు సులువాయి నుంచి మధ్యాహ్నం మూడు గంటలకు బయలుదేరారు. కర్ణాటకలోని సిరుగుప్ప తాలూకా మాటేసుగుర్ గ్రామ శివారులో రోడ్డు మలుపు తిప్పుతుండగా వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పది మందికి పైగా తీవ్ర గాయాలు కాగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను అంబులెన్సులో బళ్లారిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలిగా చాందిని

వెల్దుర్తి, ఫిబ్రవరి 26 : ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలిగా ఎస్.చాందిని, సహాయక కార్యదర్శిగా ఈదమ్మ ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన 6వ మహాసభలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. వెల్దుర్తి ప్రాజెక్టు నుంచి ఎంపికైనందుకు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు హర్షం వ్యక్తం చేశారు. అంగన్వాడీల సమస్యల పరిష్కార సాధనకు నిరంతరం కృషిచేస్తామని నూతన సభ్యులు పేర్కొన్నారు.

రైల్వే బ్రిడ్జిని నిర్మించండి

తుగ్గలి, ఫిబ్రవరి 26: రైతులు పొలాలకు వెళ్లేందుకు రైల్వే బ్రిడ్జిని నిర్మించాలని సీపీఐ జిల్లా నాయకులు నబీ రసూల్, టీడీపీ నాయకులు చంద్రశేఖర్ కోరారు. సోమవారం రామలింగాయపల్లెకు చెందిన రైతులు పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మిని కలిసి రైల్వే లైన్ల వద్ద ఉన్న బ్రిడ్జిని నిర్మించాలని కోరుతూ వంద మంది రైతులు సంతకాలు చేసిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి పడమర వైపు ఉన్న రైల్వేలైన్లు దాటి దాదాపు వేయి ఎకరాల పొలాలు ఉన్నాయని, ఆ పొలాలకు వెళ్లడానికి అనువైన బ్రిడ్జి లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టి రైతులను ఆదుకోవాలని కోరారు. స్పందించిన ఆర్డీవో రైల్వే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నబీసాహేబ్, రామలక్ష్మన్న ఉన్నారు.

వైభవంగా అంకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న తుగ్గలి నాగేంద్ర దంపతులు

తుగ్గలి, ఫిబ్రవరి 26: రాతన గ్రామంలో అంకాలమ్మ విగ్రహ, కలశ ప్రతిష్ఠ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.30 లక్షలతో నిర్మించిన నూతన దేవాలయాన్ని ప్రారంభించారు. దేవాలయానికి రూ.30వేలు ఇచ్చిన రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీటీసీ సభ్యులు వరలక్ష్మిలను ఆలయ నిర్వాహకులు శాలువ కప్పి సన్మానం చేశారు.

స్వర్ణపల్లకిలో దర్శనమిచ్చిన రాఘవేంద్రులు

మంత్రాలయం, ఫిబ్రవరి 26 : వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్ర స్వామి స్వర్ణ పల్లకీలో భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో మఠం అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి బృందావన ప్రతిమను స్వర్ణపల్లకీలో ఉంచి వైభవంగా ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించి మఠం దివాన్ భక్తులకు ఫలపుష్ప, మంత్రాక్షితలు పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.